

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కొరకు సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM
PRGI NO: APTEL/26/A5450
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం...

ఆంధ్రప్రదేశ్ ( క్రిష్ణ) ఆదివారం 19-07-2026 సంపుటి: 01 సంచిక : 15 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Andhrapradesh(Krishna) Sunday, 19-07-2026 Volume :01 Issue: 15 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani





Contact Number
9059328777


# ఎల్‌వోసీ వెంబడి పాక్ కాల్పులు

**రాజౌరి సెక్టార్‌లో రెండు గంటలపాటు కాల్పుల మోత**

- ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని తిప్పికొట్టిన భారత సైన్యం
- పాక్ కాల్పులకు భారత బలగాల నుంచి దీటైన ప్రతిస్పందన
- సరిహద్దులో గాలింపు.. అనుమానితులు జాడలేదు
- 'ఆపరేషన్ సిందూర్' తర్వాత తొలి కాల్పుల ఘటన

జమ్ము కశ్మీర్‌లోని రాజౌరి సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. శుక్రవారం రాత్రి రెండు గంటల పాటు పాక్ సైన్యం కాల్పులు జరపగా, అప్రమత్తమైన భారత సైనికులు దీటుగా ఎదురుకాల్పులు జరిపి ఉగ్రవాదుల చొరబాటు ప్రయత్నాన్ని భగ్నం చేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఎల్‌వోసీ వద్ద పాక్ నుంచి కాల్పులు జరగడం ఇదే తొలిసారి అని సైనిక వర్గాలు వెల్లడించాయి.



2లో



# మీ హయాంలో ఎన్నిఉద్యోగాలిచ్చారు ?

- బీజేపీ ఇస్తానన్న ఏడాదికి రెండు కోట్ల జాబులేవీ ?
- నోటిఫికేషన్లు కాదు... ఉద్యోగాలు ఎందుకు ఆపారు?
- పేపర్ లీకేజీలకు ఎవరు బాధ్యత వహిస్తారు? : టీపీసీసీ చీఫ్

**హైదరాబాద్**
గత బీఆర్ఎస్ సర్కార్ తన పదేండ్ల పాలనలో ఎన్ని ఉద్యోగాలిచ్చింది. నోటిఫికేషన్లు జారీ చేశామంటే సరిపోదు... ఉద్యోగాలు ఎందుకు ఆపారో చెప్పాలని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్ లోని గాంధీభవన్ లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చిందనీ, ఆ ఉద్యోగాలేవో చెప్పాలన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో, ఇప్పుడు కేంద్రంలో బీజేపీ సర్కారులో పేపర్ లీకేజీలకు ఎవరు బాధ్యత వహిస్తారని బీఆర్ఎస్, బీజేపీలపై విరుచుకుపడ్డారు. గత రెండున్నరేండ్లలో రాష్ట్రంలో

-మిగతా 2 లో

# కాలుష్య రహిత రాష్ట్రంగా ఏపీ

**అక్టోబర్ 2 నాటికి చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం**

- అక్టోబర్ 2 నాటికి చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం
- రూ.15,274 కోట్ల మౌలిక వసతుల పనులకు శ్రీకారం
- ఇంటింటా చెత్త సేకరణకు మరిన్ని విద్యుత్ ఆటోలు
- వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తికి ఎనిమిది కేంద్రాలు
- ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర సాధ్యం
- రూ.10,122 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ చేస్తాం
- నదుల అనుసంధానంతో కరువు సమస్యకు శాశ్వత పరిష్కారం
- గుడివాడలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి/**
పరిశుభ్రమైన, కాలుష్య రహిత, సంపన్న ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రతి పౌరుడు తన గ్రామం, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతోనే స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర లక్ష్యాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా గుడివాడలో నిర్వహించిన 18వ స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా రూ.15,274 కోట్ల విలువైన మున్సిపల్, ప్రజారోగ్య మౌలిక వసతుల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మెప్మే మహిళా సంఘాల ఉత్పత్తులను పరిశీలించిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను

-మిగతా 2 లో






# విక్రమ్–1 విజయవంతం

- భారత ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగాల్లో చారిత్రక ఘట్టం
- శ్రీహరికోట నుంచి తొలి ఆర్బిటాల్ రాకెట్ ప్రయోగం సక్సెస్
- సాంకేతిక లోపాన్ని అధిగమించి కక్ష్యలోకి చేరిన విక్రమ్-1
- 'మిషన్ ఆగమన్'తో వాణిజ్య అంతరిక్ష ప్రయోగాలకు కొత్త దారి
- స్వదేశీ సాంకేతికతతో 350 కిలోల ఉపగ్రహాల పంపిణీ సామర్థ్యం

**శ్రీహరికోట**
భారత అంతరిక్ష రంగంలో మరో అధ్యాయం ప్రారంభమైంది. ప్రముఖ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్ ' పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్–1 ' శనివారం నింగిలోకి దూసుకెళ్లింది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి మధ్యాహ్నం 12.05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. ఇందులోని ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా.. సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగాన్ని తాత్కాలికంగా నిలిపివేసి.. శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టారు. ఇంధన ప్రక్రియలో సమస్య ఉన్నట్టు గుర్తించి దాన్ని సరిచేశారు. 35 నిమిషాల తర్వాత రాకెట్‌ను ప్రయోగించారు. దాదాపు 20 నిమిషాల తర్వాత ఈ రాకెట్ నిర్ణీత కక్ష్యను చేరుకుంది. 'హలో స్పేస్.. విక్రమ్–1 వచ్చేసింది' అంటూ ప్రయోగం విజయంపై స్కైరూట్ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్లతో పాటు ప్రధాని మోడీ తన చేతిరాతతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్టకార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది.

-మిగతా 2 లో



# నగరంలో మోస్తరు వర్షం

- గ్రేటర్‌లో పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వాన
- బీహెచ్ఈఎల్‌లో అత్యధికంగా 1.40 సెం.మీ వర్షపాతం నమోదు
- పటాన్‌చెరు, లింగంపల్లి ప్రాంతాల్లోనూ వర్ష ప్రభావం
- మరో 36 గంటల్లో వానలు పడే అవకాశం
- నగరంలో 31.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

2లో


# కువైట్ చమురు కేంద్రంపై ఇరాన్ క్షిపణి దాడి



- ఏడో రోజూ కొనసాగిన అమెరికా వైమానిక దాడులు
- గల్ఫ్‌లో ఉద్రిక్తత.. బహ్రెయిన్, జోర్డాన్‌పైనా దాడులు
- పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధమంటూ ఇరాన్ హెచ్చరిక
- హెర్ముజ్ జలసంధిలో రెండు చమురు నౌకలు పేలినట్లు ప్రచారం

2లో

# కరెన్సీ నోట్ల ముద్రణలో ప్రైవేటు భాగస్వామ్యమా?



- ఆర్‌బీఐ అనుబంధ సంస్థ టెండర్‌పై అఖిలేశ్ అభ్యంతరం
- పాలిమర్ సబ్‌స్ట్రేట్ షీట్ల సరఫరాకు బిడ్డింగ్‌ల ఆహ్వానం
- నోట్ల ముద్రణ భద్రత, భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేసిన ఎస్పీ అధినేత
- 'కరెన్సీ నోట్లనూ ప్రైవేటీకరిస్తారా?' అంటూ కేంద్రంపై విమర్శలు

2లో



# పెట్టుబడి సూచీలో గుజరాత్ టాప్

- నీతి ఆయోగ్ తొలి ఐఎఫ్ఐలో గుజరాత్‌కు అగ్రస్థానం
- మహారాష్ట్ర, తమిళనాడులకు తర్వాతి ర్యాంకులు
- 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలపై అధ్యయనం
- పెట్టుబడుల ఆకర్షణ సామర్థ్యంపై రూపొందిన సూచీ
- 1,850 మంది పెట్టుబడిదారుల అభిప్రాయాలతో నివేదిక

**న్యూఢిల్లీ**
నీతి ఆయోగ్ రూపొందించిన మొట్టమొదటి పెట్టుబడి స్నేహపూర్వక సూచీ(ఐఎఫ్ఐ)- 2026లో దేశంలోనే అత్యంత పెట్టుబడి-అనుకూల రాష్ట్రంగా గుజరాత్ నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర, తమిళనాడు ఉన్నాయి. ఒకరి ఉత్తమ విధానాల నుండి మరొకరు నేర్చుకుంటూనే ప్రైవేట్ పెట్టుబడుల కోసం పోటీపడేలా ఈ సూచీ ర్యాంకింగ్‌లు రాష్ట్రాలను ప్రోత్సహిస్తాయని నీతి ఆయోగ్ ఆశిస్తున్నది. శుక్రవారం విడుదలైన ఐఎఫ్ఐ నివేదిక పెట్టుబడులను ఆకర్షించి, వాటిని నిలబెట్టుకునే సామర్థ్యంపై 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలను అంచనా వేస్తుంది. ఇందుకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను సిద్ధం చేసేటపుడు 1,850 మందికి పైగా పెట్టుబడిదారులను సర్వే చేయడంతోపాటు 165 మంది వాటాదారుల నుండి వచ్చిన సూచనలను కూడా పొందుపరిచారు. ఈ నివేదిక రాష్ట్రాలను అగ్రశ్రేణి రాష్ట్రాలు, ముందంజలో ఉన్న రాష్ట్రాలు, వర్ధమాన రాష్ట్రాలు, ఆకాంక్ష గల రాష్ట్రాలుగా వర్గీకరించింది.

-మిగతా 2 లో

# ఆగస్టు 1న 'భోగాపురం ప్రారంభం




**ఖరారైన ప్రధానమంత్రి షెడ్యూలు**

- అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు మోదీ శ్రీకారం
- చరిత్రలో నిలిచిపోయేలా కార్యక్రమం
- ఉత్తరాంధ్ర అన్‌స్టాపబుల్: చంద్రబాబు

**అమరావతి/విజయనగరం,**
ఉత్తరాంధ్ర మణిహారం.. భోగాపురంలో ప్రపంచస్థాయి అధునాతన సౌకర్యాలతో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ విమానాశ్రయం ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో శనివారం సీఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్షలో స్వయంగా ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. ఈ సమీక్షలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పలువురు మంత్రులతోపాటు భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు చేపట్టిన జీఎంఆర్

-మిగతా 2 లో



# ప్రతి భారతీయుడూ గర్వపడే క్షణం

- 'విక్రమ్-1' విజయంపై చంద్రబాబు హర్షం
- శ్రీహరికోటలోని షార్‌లో రాకెట్ ప్రయోగాన్ని కుమారుడితో కలిసి వీక్షించిన లోకేశ్

**అమరావతి/సూళ్లూరుపేట,**
విక్రమ్–1 రాకెట్ విజయవంతంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. తొలి ప్రయోగంలోనే విజయవంతంగా కక్ష్యలోకి చేరడంతో భారత్ మరో చారిత్రక మైలురాయిని అధిగమించిందని పేర్కొన్నారు. ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్‌స్పేస్, ఎన్ఎ?సఐఎల్‌కు శనివారం 'ఎక్స్' వేదికగా సీఎం అభినందనలు తెలిపారు. అగ్ర దేశాలతో పోటీపడే స్థాయికి భారత ప్రైవేటు అంతరిక్ష రంగం ఎదిగిందనే దాన్ని ఈ విజయం నిరూపించిందన్నారు. ఇది భారత అంతరిక్ష

-మిగతా 2 లో

WWW.NETIDARSHINI.COM
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం

# ఎల్‌వోసీ వెంబడి పాక్ కాల్పులు

**-ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని తిప్పికొట్టిన భారత సైన్యం**
**-పాక్ కాల్పులకు భారత బలగాల నుంచి దీటైన ప్రతిస్పందన**
**-సరిహద్దులో గాలింపు.. అనుమానితులు జాడలేదు**
**-'ఆపరేషన్ సిందూర్' తర్వాత తొలి కాల్పుల ఘటన**



**న్యూఢిల్లీ:**
పాకిస్థాన్ మరోసారి దుశ్చర్యకు పాల్పడింది. జమ్ము కశ్మీర్‌లోని రాజౌరి సెక్టార్‌లో నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి శుక్రవారం రాత్రి రెండు గంటల పాటు పాకిస్థాన్ భారీ కాల్పులు జరిపింది. సరిహద్దు నుంచి ఉగ్రవాదులు చొరబడేందుకు ప్రయత్నించగా.. భారత సైనికులు ఎదురు కాల్పులు జరిపి.. ఉగ్రవాదులు చొరబడకుండా అడ్డుకున్నారని సైనిక వర్గాలు తెలిపాయి. ముందుగా పాక్ నుంచి కాల్పులు ప్రారంభం అయిన వెంటనే సరిహద్దు వెంట కాపలా కాస్తున్న సైనికులు ఎదురు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. శనివారం ఉదయం సరిహద్దు వెంట గాలింపు చర్యలు చేపట్టగా ఎవరూ లేరని అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ కాల్పులు జరపడం ఇదే మొదటిసారి అని చెప్తుతున్నారు.

# విక్రమ్–1 విజయవంతం

మొదటి తరువాయి

వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్–1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్ని కూడా నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాంల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేగాక, ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ స్కైరూట్ బృంద సభ్యులు, ఇస్రో మాజీ చైర్మె న్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులను సైతం ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు.
'మిషన్ ఆగమన్'..
'మిషన్ ఆగమన్' పేరుతో స్కైరూట్ ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రయివేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టారు. విక్రమ్–1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను రోదసిలోకి పంపించారు. ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి కీలక సమాచారం సేకరించనున్నారు. ఈ సమాచారంతో భవిష్యత్తు వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.సుమారు ఏడు అంతస్తుల భవనం ఎత్తుతో రూపొందిన విక్రమ్–1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణం తో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లో ఎర్త్ ఆర్బిట్(ఎల్ఈఓ)లో ప్రవేశపెట్టే సామర్థ్యం కలిగి ఉంది. 2022లో విక్రమ్–ఎస్ ద్వారా భారత తొలి ప్రయివేట్ రాకెట్‌ను విజయవంతంగా అంతరిక్షంలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్–1తో దేశపు తొలి ప్రయివేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టడం విశేషం.

## కరెన్సీ నోట్ల ముద్రణనూ ప్రైవేటీకరిస్తారా?..

**లక్నో,జూలై 18:**



భారత కరెన్సీ నోట్ల ముద్రణ ప్రక్రియలో ఒక ముఖ్యమైన భాగాన్ని ప్రైవేటీకరించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ శుక్రవారం ఆరోపించారు. రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) అనుబంధ నోట్ల ముద్ర సంస్థ జారీచేసిన టెండర్ నోటీసుపై ఎక్స్‌లో ట్వీట్ చేశారు. రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ ప్రైవేట్ లిమిటెడ్(బీఆర్‌బీఎన్‌ఎంపీఎల్) జారీచేసిందని.ఈ నోటీసు భారతీయ కరెన్సీ నోట్ల కోసం భద్రతా లక్షణాలతో కూడిన ప్రత్యేక పాలిమర్ సబ్‌స్ట్రేట్ షీట్ల తయారీ, సరఫరా కోసం అర్హత గల సంస్థల నుండి ప్రపంచవ్యాప్తంగా బిడ్డింగ్‌లను ఆహ్వానిస్తోందని తెలిపారు. కరెన్సీ నోట్ల ముద్రణ భవిష్యత్తుపై ఈ చర్య ఆందోళనలు రేకెత్తించిందని పేర్కొన్నారు. అవినీతిమయమైన బీజేపీ పాలనలో ఇక కరెన్సీ నోట్లను కూడా ప్రైవేటీకరిస్తారా? కమీషన్లు తీసుకునే విధానం ఇంతటి అథమ స్థాయికి దిగజారుతుందని ప్రజలు ఊహించలేదు" అని అఖిలేశ్ విమర్శించారు.

## మీ హయాంలో ఎన్నిఉద్యోగాలిచ్చారు ?

మొదటి తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలు రికార్డుల్లో ఉన్నాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాకి లెక్కలు చెప్పడం లేదనీ, అన్ని కరెక్ట్ లెక్కలే చెబుతున్నామన్నారు. ఈ కార్ రేసింగ్ లో మంత్రులు స్కాం లు చేయలేదా? కాళేశ్వరం కూలిపోలేదా? బీఆర్ఎస్ లెక్కలు జనాలు తీర్చారు. ఇంకా ఏమి కావాలి? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఒక్క గ్రూప్ వన్ ఉద్యోగం కూడా బీఆర్ఎస్ భర్తీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటికో ఉద్యోగమిస్తామని కేసీఆర్ తన కుటుంబ సభ్యులందరికి ఉద్యోగాలిచ్చుకున్నారని మహేశ్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు. నీళ్లు, నిధులను దోపిడీ చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 70 వేల మందికిపైగా ఉద్యోగ పత్రాలను బహిరంగంగా అందజేసిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ దుష్టపాలనను ప్రజలు మరిచిపోలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పథకాలు అద్భుతంగా అమలు అవుతున్నాయని కొనియాడారు. రూ.8 లక్షల కోట్ల అప్పులను భరిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. పదేండ్లలో ఇచ్చిన ఉద్యోగాల లెక్క చెప్పని బీఆర్ఎస్ నేతలకు విద్యార్థులు, నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. హామీ ఇచ్చినట్టుగానే ప్రతి నెల పది లోపు ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. నోటిఫికేషన్ ఇచ్చేందుకే బీఆర్ఎస్ భయపడితే, తాము నియామక పత్రాలను అందజేశామని వివరించారు. రాహుల్ గాంధీ హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు.

# కాలుష్య రహిత రాష్ట్రంగా ఏపీ

మొదటి తరువాయి

ప్రారంభించారు. వివిధ మున్సిపల్ సంస్థలకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ పురస్కారాలను అందజేసి, ఆ కార్యక్రమంపై రూపొందించిన కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్వచ్ఛ రాజకీయాలే లక్ష్యంగా దివంగత ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని గుర్తు చేసిన ముఖ్యమంత్రి, ప్రస్తుతం తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి, సంపద సృష్టి లక్ష్యంగా పాలన సాగిస్తోందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదలకు శాంతిభద్రతలు, పారదర్శక పాలన, అవినీతి రహిత వ్యవస్థకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పరిశుభ్రత అంటే కేవలం రోడ్లు ఉచ్చడం కాదని, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, సురక్షిత జీవన విధానమే అసలు ఉద్దేశమని చంద్రబాబు అన్నారు. ఇంటి నుంచే చెత్త తగ్గించే విధానం నేటి జీవనశైలిని అలవాటు చేసుకోవాలని, వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి కుటుంబం వ్యర్థాలను వేర్వేరుగా వర్గీకరించి అందించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి చెత్త సేకరణ కోసం ఇప్పటికే 126 విద్యుత్ ఆటోలను ప్రారంభించామని, త్వరలో మరో 1,104 విద్యుత్ ఆటోలను అందుబాటులోకి తీసుకువస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. రూ.528 కోట్లతో ఆధునిక వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి కోసం ఎనిమిది కేంద్రాలను నిర్మిస్తున్నామని వెల్లడించారు. గతంలో పేరుకుపోయిన 140 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించామని, అక్టోబర్ 2 నాటికి రాష్ట్రాన్ని పూర్తిగా చెత్త రహితంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వానికి పేదల పక్షాన ఆలోచించే మనసు ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ నెల 22 నుంచి 24 వరకు "తల్లికి వందనం" పథకం కింద 67,47,197 మంది విద్యార్థులకు సంబంధించి రూ.10,122 కోట్లను తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయం, ఆక్వా రంగాలకు ప్రభుత్వం పూర్తి మద్దతుగా ఉంటుందని చంద్రబాబు తెలిపారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాకు నీటిని అందిస్తున్నామని, పోలవరం పూర్తయిన తర్వాత మరింత మెరుగైన సాగునీరు జరుగుతుందని చెప్పారు. వంశధార నుంచి పెన్నా వరకు నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలో కరువు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. రాజకీయాలపై మాట్లాడిన ముఖ్యమంత్రి, 2024 ఎన్నికల్లో ప్రజలే రాజకీయ చెత్తను శుభ్రం చేశారని వ్యాఖ్యానించారు.

# ఆగస్టు 1న 'భోగాపురం ప్రారంభం

మొదటి తరువాయి




సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. చంద్రబాబు మాట్లాడుతూ.. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయేలా జరగాలని అధికారులను ఆదేశించారు. కొత్త ఎయిర్‌పోర్టుతో రాష్ట్రానికి కొత్త అవకాశాలు వస్తాయన్నారు. పోర్టులు, హైవేలు, పరిశ్రమలు, ఎయిర్‌పోర్టు, టూరిజం ప్రాజెక్టులతో ఉత్తరాంధ్ర అన్‌స్టాపబుల్ ప్రగతిని సాధిస్తుందని తెలిపారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఒక అంతర్జాతీయ విమానాశ్రయం ఉండాలని భావించామని చెప్పారు. అనంతరం, భారత విమానయాన సంస్థకు దరఖాస్తు చేసి.. విమానాశ్రయానికి అనువైన ప్రదేశంగా భోగాపురాన్ని గుర్తించామన్నారు. అప్పటి విమానయాన శాఖ మంత్రి పూసపాటి అశోక్‌గజపతి రాజు సంబంధిత అనుమతులను సకాలంలో మంజూరు చేశారని గుర్తు చేశారు. భోగాపురం విమానాశ్రయం కోసం భూములు సేకరిస్తున్న సమయంలో వైసీపీ అధ్యక్షుడు జగన్ ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారని తెలిపారు. ఎర్రబస్సు కూడా వెళ్లని చోటుకు ఎయిర్‌బస్ ఎందుకంటూ ఎద్దేవా చేశారని గుర్తు చేశారు.కూటమి అధికారంలో వచ్చాక రెండేళ్లలోనేభోగాపురం అందు బాటులోకి తెచ్చా మన్నారు. ఈ విమానాశ్రయం రాకతో అంతర్జాతీయంగా కనెక్టివిటీ పెరుగుతుందని, రాష్ట్రం పారిశ్రామిక, వాణిజ్య కారిడార్‌గా మారుతుందని సీఎం పేర్కొన్నారు. శంషాబాద్ విమానాశ్రయం తరహాలోనే భోగాపురం విమానాశ్రయం కూడా రాష్ట్రాభివృద్ధిలోప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఈ విమాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి పౌరుడూ సంబరాలు చేసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ సైతం ఇదే విషయాన్ని తెలిపారు. శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో.. "ఆగస్టు 1న ఉత్తరాంధ్ర.. 'ఉత్తమాంధ్ర'గా నిలిచేందుకు ము హూర్తం ఆసన్నమైంది. ప్రధాని మోదీ చేతుల మీదుగా ఓగొప్ప క్షణం ఆవిష్కృతం కానుంది." అని పేర్కొన్నారు

# నగరంలో మోస్తరు వర్షం

**- గ్రేటర్‌లో పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వాన**
**-బీహెచ్ఈఎల్‌లో అత్యధికంగా 1.40 సెం.మీ వర్షపాతం నమోదు**
**- పటాన్‌చెరు, లింగంపల్లి ప్రాంతాల్లోనూ వర్ష ప్రభావం**
**- మరో 36 గంటల్లో వానలు పడే అవకాశం**
**-నగరంలో 31.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు**



జూలై 18
గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసింది. రాత్రి 10గంటల వరకు బీహెచ్ఈఎల్‌లో 1.40సెం.మీలు, పటాన్‌చెరులో 1.18సెం.మీలు, లింగంపల్లిలో 1.19సెం.మీలు, అమీన్‌పూర్‌లో 1.08సెం.మీలు, మియాపూర్‌లో 1.0 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. రాగల 36గంటల్లో నగరంలోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు. కాగా శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 31.5 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.5 డిగ్రీలు, గాలిలో తేమ 89శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.ద

# కువైట్ చమురు కేంద్రంపై ఇరాన్ క్షిపణి దాడి

**-ఏడో రోజూ కొనసాగిన అమెరికా వైమానిక దాడులు**
**-గల్ఫ్‌లో ఉద్రిక్తత.. బహ్రెయిన్, జోర్డాన్‌పైనా దాడులు**
**-పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధమంటూ ఇరాన్ హెచ్చరిక**
**-హెర్ముజ్ జలసంధిలో రెండు చమురు నౌకలు పేలినట్లు ప్రచారం**

**టెహ్రాన్, జూలై 18:**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పుడు దీని ప్రభావం గల్ఫ్‌పై కూడా తీవ్రంగా పడుతున్నది. ఇరాన్ మిలిటరీ సౌకర్యాలు లక్ష్యంగా అమెరికా ఏడవ రోజు దాడులు కొనసాగించింది. దీనికి ప్రతీకారంగా యూఎస్ స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ శనివారం కువైట్, బహ్రెయిన్, జోర్డాన్‌లపై క్షిపణి, డ్రోన్ల దాడులు నిర్వహించింది. కువైట్‌లోని ఒక ప్రధాన చమురు కేంద్రంపై దాడులు చేసింది. తమకు చెందిన ఒక ముఖ్యమైన ఆయిల్ కేంద్రంపై ఇరాన్ దాడి చేసినట్టు కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రకటించింది. ఈ



దాడిలో పలువురు గాయపడగా, గణనీయమైన నష్టం ఏర్పడింది. ఈ దాడులు నీటిశుద్ధి ప్లాంట్లు, విమానాశ్రయ కార్యకలాపాలకు అంతరాయం కలిగించాయి. తమపై దాడులు ఇలా మరో మూడు నాలుగు రోజులు కొనసాగితే తాము పూర్తి స్థాయి ఘర్షణకు దిగుతామని ఇరాన్ హెచ్చరించింది. తమ విద్యుత్తు మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని, ఎర్ర సముద్రంలోని బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది.
మందుపాతరలు పేలి రెండు చమురు నౌకలు ధ్వంసం!
ఆంక్షలను ఉల్లంఘించి హెర్ముజ్ జలసంధిని దాటడానికి ప్రయత్నించిన రెండు చమురు నౌకలు సముద్రంలో అమర్చిన మందుపాతరలకు తగిలి నిప్పంటుకుని పేలిపోయాయి. ఇరాన్ పాక్షిక అధికారిక వార్తా సంస్థ తస్నీమ్ న్యూస్ శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించింది. అమెరికా సహకారంతో హెర్ముజ్ జలసంధిని దాటడానికి ప్రయత్నించిన నాలుగు నౌకలను అడ్డుకున్నామని, రెండు చమురు నౌకలు పేలిపోయాయంటూ ఇరాన్ చేసిన ప్రకటనను యూఎస్ మిలిటరీ సెంట్రల్ కమాండ్ ఖండించింది. ఇందులో నిజం లేదని స్పష్టం చేసింది.

# ప్రతి భారతీయుడూ గర్వపడే క్షణం

మొదటి తరువాయి

రంగంలో ఇది ఒక నూతన శకానికి నాంది అని పేర్కొన్నారు. ఈ విజయం ప్రతి భారతీయుడు గర్వపడే క్షణమని, భావితరాల యువ శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

**ఏపీకి రండి.. స్కైరూట్‌కు లోకేశ్ ఆహ్వానం**

విక్రమ్–1 రాకెట్ ప్రయోగాన్ని మంత్రి లోకేశ్ కుమారుడు దేవాంశ్‌తో కలిసి ప్రత్యక్షంగా వీక్షించారు. శనివారం షార్‌కు వెళ్లిన ఆయన.. మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ గమనాన్ని ఆసక్తిగా గమనించారు. ప్రయోగం విజయం సాధించిన అనంతరం లోకేశ్ కంట్రోల్ సెంటర్ నుంచే మాట్లాడుతూ.. స్కైరూట్ సంస్థ తొలి ప్రయత్నంలోనే రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించడం వారి పనితీరుకు నిదర్శనమని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని ప్రయోగాలు చేపట్టాలని ఆకాంక్షించారు. స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో కూడా కంపెనీ పెట్టేందుకు అన్ని వనరులు పుష్కలంగా ఉన్నాయని, ప్రభుత్వం పరంగా కూడా అన్ని సహకారాలు అందించి ప్రోత్సహిస్తామన్నారు. ఏపీకి రావాలని ఆహ్వానించారు. ఇప్పటికే వైజాగ్‌లో ఆ కంపెనీ ప్రతినిధులను కలిశామని తెలిపారు



# రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ __ ఆంధ్ర కార్యక్రమం



**రాజమండ్రి, జూలై18 (నేటి దర్శిని)**

స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆంధ్రప్రదేశ్ వైద్య విద్యా సంచాలకులు మార్గదర్శకాల మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. రాజు ఆదేశానుసారం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. కె.వి. శివప్రసాద్ ప్రారంభోపన్యాసం చేస్తూ స్వచ్ఛత యొక్క విశిష్టత, సమాజ ఆరోగ్య పరిరక్షణలో పరిశుభ్రత యొక్క ఆవశ్యకతను వివరించారు. ప్రతి పౌరుడు స్వచ్ఛ ఆంధ్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. వైద్య విద్యార్థులు పరిశుభ్రతపై ప్రజలను చైతన్యం చేయడంలో



ముందుండాలన్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ విభాగములో పనిచేస్తున్న ఆరోగ్య విద్యా బోధకులు ఆర్ శ్రీనివాస్ పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని కార్యక్రమములో పాల్గొన్నవారిచే ప్రతిజ్ఞ చేయించారు.

అనాటమీ విభాగాధిపతి డా. టి. శారద పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని అసిస్టెంట్ డైరెక్టర్ డా. సూర్యారావు సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని వివిధ విభాగాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పరిపాలన విభాగ సిబ్బంది, పారిశుధ్య విభాగపు సిబ్బంది మరియు ఇతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజారోగ్య అభివృద్ధికి అంకితభావంతో అందరూ కలిసి పనిచేయాలని కార్యక్రమంలో పిలుపునిచ్చారు.

# స్థానిక సంస్థ ఎన్నికల్లో మాసత్తా చూపిస్తాం..

**-జనసేన పార్టీకి నాలుగు శాతం కూడా లేని ఓటు బ్యాంకు..**
**-మీరా మాట్లాడేది జగన్ గురించి దీపికమ్మ గురించి..**
**-బిసి సెల్ నియోజవర్గ అధ్యక్షులు రామాంజనేయులు**

**హిందూపురం జూలై 18 (నేటి దర్శిని):**
సత్య సాయి జిల్లా హిందూపురం ఇటీవల కాలంలో దాదాపు 15 రోజుల నుండి పార్టీల మధ్య హోరాహోరీ నడుస్తుందని అయితే మా వైయస్సార్సీపి పార్టీ గురించి మాట్లాడే అర్హత ప్రభుత్వానికి గాని ముఖ్యంగా జనసేన పార్టీకి గాని ఏమాత్రం లేదని నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు మానేంపల్లి రామాంజనేయులు తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రస్తుతం రౌడీలకు రాజ్యాంగ మారిపోయింది అన్నారు. ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని నోటికి అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. ఇటీవల ఒక ఎమ్మెల్యే మా వైసీపీ నేత తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని అసభ్యంగా మాట్లాడిన తీరు మొత్తం రాష్ట్రమంత తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇక అదే విధంగా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించి శ్రీకాంత్ అనే వ్యక్తిని వివచిచక్షణారహితంగా మూడు రోజులపాటు




నిర్బంధించి మానసికంగా హింసించడం కొట్టడం జరిగింది అన్నారు. పోలీసులు కూటమి ప్రభుత్వం చేతిలో కీళ్ల బొమ్మలుగా మారిపోయారు అన్నారు. బీసీ కురువ శ్రీకాంత్ ను విచక్షణా రహితంగా కొట్టిన పోలీసులపై మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఇక ముఖ్యంగా నియోజకవర్గ విషయానికి వస్తే హిందూపురం నియోజకవర్గం లో జనసేన పార్టీ హుసే లేదన్నారు. నియోజవర్గంలో వెతికి చూసిన సరైన నాయకుడు లేడు అన్నారు. కనీసం రెండు శాతం ఓడిపోయాక కూడా ఈ నియోజకవర్గంలో లేదన్నారు. వీరా మా పార్టీ గురించి మాట్లాడేది అని విమర్శించారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో మీ సత్తా ఏదో చూపించాలని మాసత్తా ఏదో చూపిస్తామని రామాంజనేయులు ధ్వజమెత్తారు. లేపాక్షి మండలంలో వైసిపి జెండా రెపరెపలాడుతుందని ఈ విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ స్థానిక సంస్థ ఎన్నికల్లో విజయదుంద విమోగిస్తుందన్నారు. పోలీసులు కూడా ఎటువంటి రాజకీయాలు చేయకుంటే ఇంకా మంచి మెజారిటీతో మా అభ్యర్థులు గెలుస్తారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఏదేమైనా హిందూపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ ఉనికి కోల్పోయిందని జనసేన పార్టీలో సరైన నాయకత్వ లక్షణాలు లేకుండా ఉండడంతోనే మా పార్టీలోకి జనసేన పార్టీ నుంచి వలసలు వస్తున్నారన్న విషయాన్ని ఆయన తెలిపారు. ఇలాంటి నిజాలు జీర్ణించుకోలేక చిల్లరి రాజకీయాలు చేస్తున్నారని ఖబర్దార్ అంటూ రామాంజనేయులు తెలిపారు.

# స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్రకు కొత్తచెరువు నుంచి శ్రీకారం

**విద్యార్థులతో కలిసి మానవహారం, స్వచ్ఛత ప్రతిజ్ఞ, శుభ్రత**
**-కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**

**పుట్టపర్తి జూలై 18 (నేటి దర్శిని):**
స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కొత్తచెరువులో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమాల్లో ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కిష్టప్ప, విద్యాశాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా నెహ్రూ సర్కిల్ వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్లాస్టిక్ రహిత పుట్టపర్తి నియోజకవర్గం లక్ష్యంగా మానవహారం ఏర్పాటు చేసి



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చీపుర్లు పట్టుకుని పరిసరాలను శుభ్రం చేస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. అనంతరం జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలలోని సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటి కార్యక్రమాల అమలుపై విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల గోడలపై విద్యార్థులతో కలిసి స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే చిత్రాలను గీశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, "స్వచ్ఛత ఒక్కరోజు కార్యక్రమం కాదు. ప్రతి ఇంటి నుంచి, ప్రతి పాఠశాల నుంచి, ప్రతి గ్రామం నుంచి ప్రారంభమయ్యే ప్రజా ఉద్యమం. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రతను అలవాటుగా మార్చుకుంటేనే స్వర్ణాంధ్ర లక్ష్యం సాధ్యమవుతుంది" అని అన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రమైన గ్రామాలు, పచ్చని వాతావరణం సమాజ ఆరోగ్యానికి ఎంతో అవసరమని, యువత, విద్యార్థులు స్వచ్ఛత ఉద్యమంలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# ఈశ్వరమ్మ యాదవ్ కు జాగృతి ఘన సత్కారం

**మనసురాబాద్,జూలై 18 (నేటి దర్శిని):**
యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులుగా నియమింపబడిన మాజీ కౌన్సిలర్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ను జాగృతి అభ్యుదయ సంఘం టీం ఈరోజు వారి స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు తినిపించారు. ఈశ్వరమ్మను సత్కరించినవారిలో జాగృతి అభ్యుదయ సంఘం ఛైర్మన్ భావన శ్రీనివాస్, డైరెక్టర్ యాదా



రామలింగేశ్వరరావు, జాయింట్ సెక్రటరి బచ్చనబోయిన యాదయ్య యాదవ్, సభ్యులు రామచంద్రయ్య, గుద్దేటి నర్సింహులు, అరుణ వెంకట రెడ్డి తదితరులున్నారు. 85 సంవత్సరాల వయస్సులో తనకొచ్చిన ఈ అవకాశం పట్ల ఈశ్వరమ్మ కృతజ్ఞతతో దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, మండలి తీర్మానాలకు అనుగుణంగా భక్తులకు సేవ చేస్తానని అన్నారు.

# సుధా ప్రవీణ్ కు జనసేన నేతల సత్కారం..



**కోడూరు జూలై 18 (నేటి దర్శిని):**
కోడూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తూ గత కొద్దిరోజుల కిందట డిడిఎల్ఓ గా పదోన్నతి పొంది తిరువూరు డిడిఎల్ఓ గా బదిలీపై వెళుతున్న సుధా ప్రవీణ్ ను కోడూరు మండల జనసేన పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. స్థానిక కార్యాలయంలో సుధా ప్రవీణ్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువా కప్పి ఘనంగా సత్కరించి, స్వీట్స్ అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మరె గంగయ్య మాట్లాడుతూ... కోడూరు మండలంలో గత ఆరు సంవత్సరాలుగా సేవలందిస్తూ ప్రజల మన్ననలను పొందారని, ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుని వెళ్లడంలో సుధా ప్రవీణ్ కృషి చేశారన్నారు. వృత్తి పట్ల నిబద్ధత పనిచేస్తూ సోమిరెడ్డిగా పేరు సౌమ్యుడుగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, కోడూరు పట్టణ అధ్యక్షులు కోట రాంబాబు, వర్రే రాంబాబు, కాగిత రామారావు, అప్పి కట్ల వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మమే గెలిచింది: అక్కల రామరెడ్డి

**బాపట్ల, జూలై 18 (నేటి దర్శిని): :**
బాపట్ల నియోజకవర్గం పిట్టల వాని పాలెం మండలంలో 2020 నుండి చింతాడ ఆనంద్, పాస్టర్ అనిల్ కలిసి బలవంతపు మత మార్పిడులకు పాల్పడుతూ, తన పూర్వీకుల భూమిని ఆక్రమించుకునేందుకు తనపై, గ్రామస్థులపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించారని బిజెపి మండల అధ్యక్షులు అక్కల రామిరెడ్డి ఆరోపించారు.ఆ కేసుపై తాను హైకోర్టును ఆశ్రయించగా, 2025



ఏప్రిల్ 30న కేసును క్వాష్ చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రత్యర్థులు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన ప్రత్యేక పిటిషన్‌ను కూడా విచారించిన సుప్రీంకోర్టు, 2026 మార్చి 24న హైకోర్టు తీర్పును సమర్థిస్తూ కేసును క్వాష్ చేసిందని చెప్పారు. తదనంతరం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్ కూడా నేడు కొట్టివేయబడిందని తెలిపారు. తనపై తప్పుడు కేసు బనాయించిన వారిపై రూ.1 కోటి పరిహారం కోరుతూ పరువు నష్టం దావా వేస్తానని, అలాగే అప్పట్లో వారికి సహకరించిన అధికారులు, తప్పుడు సాక్ష్యాలు చెప్పిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.
ధర్మమే గెలిచింది అంటూ న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**చింతపల్లి మండలంలోని హాస్టళ్లు, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను పరిశీలించిన మండల స్పెషల్ ఆఫీసర్ గోవిందయ్య**

**చింతపల్లి, జూలై 18 (నేటి దర్శిని):**
చింతపల్లి మండల స్పెషల్ ఆఫీసర్ గోవిందయ్య శనివారం మండలంలోని మూడు ప్రభుత్వ హాస్టళ్లతో పాటు జెడ్పీహెచ్ఎస్ చింతపల్లి పాఠశాలను



ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజనం నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థుల హాజరు, బోధన విధానం, పాఠశాల నిర్వహణపై ఆరా తీశారు. విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే హాస్టళ్లు, పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఎంపీడీఓ సుజాత, ఎంఈఓ అంజయ్య, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడు ఎస్సై బాధ్యతలు స్వీకరించిన ఎం. శోభన్ బాబుకు ఘనంగా సన్మానం..



**మునుగోడు జూలై 18 (నేటి దర్శిని):**
గుండాల మండలం నుండి ఉద్యోగ బాధ్యత భాగంగా మునుగోడు ఎస్సై బాధ్యతలు స్వీకరించిన ఏం. శోభన్ బాబును కలిసి ఘనంగా సన్మానించిన వెలుతురు పేపర్ ఎడిటర్ బక్క యాదయ్య గౌడ్ సింగారం మాజీ సర్పంచ్ గుర్రాల పరమేష్ సన్మానం చేశారు

# థియేటర్లలో నిరాశ.. ఓటీటీలో ప్రభాస్ సునామీ,

## ది రాజా సాబ్'కు 17.5 మిలియన్ వ్యూస్




టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్' థియేటర్లలో ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయినా, ఓటీటీలో మాత్రం సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రముఖ మీడియా కన్సల్టింగ్ సంస్థ ఓర్మాక్స్ స్ట్రీమ్‌వ్యూ విడుదల చేసిన 2026 తొలి ఆరు నెలల నివేదికలో ఈ చిత్రం భారతదేశంలో అత్యధిక వ్యూస్ సాధించిన సౌత్ ఇండియన్ సినిమాగా అగ్రస్థానంలో నిలిచింది. థియేట్రికల్ రిలీజ్ సమయంలో మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో మాత్రం ప్రేక్షకులు ఈ చిత్రానికి భారీ ఆదరణ చూపించారు. జియోహాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చిన 'ది రాజా సాబ్' ఏకంగా 17.5 మిలియన్ వ్యూస్ సాధించి, ఈ ఏడాది తొలి అర్ధభాగంలో అత్యధికంగా వీక్షించిన సౌత్ సినిమా అనే ఘనతను సొంతం చేసుకుంది.ఓర్మాక్స్ విడుదల చేసిన టాప్-10 జాబితాలో మలయాళ చిత్రాలు నాలుగు స్థానాలు దక్కించుకుని తమ సత్తా చాటగా, తెలుగు నుంచి 'ది రాజా సాబ్', 'అగ్లీ స్టోరీ', 'అఖండ 2', 'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి' చిత్రాలు చోటు దక్కించుకున్నాయి. తమిళం నుంచి 'బ్లాస్ట్', 'యూత్' సినిమాలు కూడా ఈ జాబితాలో నిలిచాయి. అయితే అన్ని చిత్రాలను వెనక్కి నెట్టి ప్రభాస్ సినిమా అగ్రస్థానంలో నిలవడం విశేషం.దర్శకుడు మారుతి తెరకెక్కించిన ఈ హారర్-కామెడీ చిత్రంలో ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటించారు. థియేటర్లలో ఆశించిన ఫలితం రాకపోయినా, ఓటీటీలో లభించిన ఈ భారీ ఆదరణ ప్రభాస్‌కు డిజిటల్ ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌ను మరోసారి చాటిచెప్పింది. థియేటర్లలో మిశ్రమ ఫలితం అందుకున్న సినిమా.. ఓటీటీలో మాత్రం రికార్డు స్థాయి వ్యూస్ సాధించి నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకోవడం ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇక ప్రభాస్ ప్రస్తుతం ఫౌజీ చిత్రంతో బిజీగా ఉన్నాడు. ఈ సినిమా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతుంది. ఈ సినిమా తర్వాత సలార్ 2, కల్కి 2, స్పిరిట్ వంటి చిత్రాలు చేయనున్నాడు.



హాట్ ఫొటోలతో మత్తెక్కిస్తున్న రకుల్ ప్రీత్ సింగ్?..

# ఇంగ్లిష్ రాదని ఆటపట్టించేవారు!



తన పాఠశాల రోజుల గురించి కథానాయిక భాగ్యశ్రీ బోర్సే ఆసక్తికరమైన విషయాల్ని పంచుకుంది. ఇంగ్లిష్ రాకపోవడంతో అందరూ తనను ఆటపట్టించేవారని, నాటి అవమానాలను సవాలుగా తీసుకొని చదువుల్లో రాణించానని చెప్పుకొచ్చింది. ఇటీవల ఓ కాలేజీ విద్యార్థులతో జరిపిన ముఖాముఖిలో ఆమె ఈ సంగతుల్ని వెల్లడించింది. 'మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో నా బాల్యం గడిచింది. అక్కడే మరాఠీ మీడియం స్కూల్‌లో చదువుకున్నా. కొన్నాళ్ల తర్వాత నాన్న ఉద్యోగరీత్యా మా కుటుంబమంతా నైజీరియాకు షిఫ్ట్ అయ్యాం. అక్కడ ఇంగ్లిష్ మీడియం కావడంతో ఇబ్బందులు మొదలయ్యాయి.నాకేమో మరాఠీ, హిందీ తప్ప మరో భాష తెలియదు. ఇంగ్లిష్ రాదని స్కూల్లో అందరూ హేళన చేసేవారు. జోక్స్ వేస్తూ ఆటపట్టించేవారు. అయినా నేను ఏ మాత్రం కుంగిపోలేదు. అవహేళనలను ఛాలెంజ్‌గా స్వీకరించా. కొద్దిరోజుల్లోనే ఇంగ్లిష్‌పై పట్టుసాధించాను. ఆ తర్వాత కొన్నాళ్లకు ఇంగ్లిష్‌లో అనర్గళంగా ప్రసంగించే స్థాయికి చేరుకున్నా. పాజిటివ్ మైండ్‌సెట్‌తో ఉంటే ఎలాంటి సవాళ్లనైనా అధిగమించవొచ్చని నా స్కూల్ డేస్‌లోనే అర్థమైంది' అని చెప్పింది భాగ్యశ్రీ బోర్సే. ఇటీవలే ఈ భామ 'లెనిన్' సినిమాతో కెరీర్‌లో తొలి విజయాన్ని అందుకుంది.



# పెద్ది తర్వాత కొత్త సినిమాకు జాన్వీకపూర్ గ్రీన్ సిగ్నల్.. !


దేవర సినిమాతో టాలీవుడ్‌కు గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది బాలీవుడ్ భామ జాన్వీకపూర్. ఈ చిత్రం జాన్వీకపూర్ కు ఆశించిన స్థాయిలో బ్రేక్ ఇవ్వలేకపోయింది. రీసెంట్‌గా రాంచరణ్‌తో కలిసి నటించిన పెద్ది బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. అయితే ఈ మూవీ కూడా జాన్వీకపూర్‌కు అంతగా కలిసి రాలేదు. పెద్దిలో జాన్వీకపూర్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాలపై తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. భవిష్యత్‌లో ఇలాంటి పాత్రలు చేయొద్దంటూ పలువురు నెటిజన్లు జాన్వీకపూర్‌కు సూచించారు. అయితే జాన్వీకపూర్ నెక్ట్స్ ఎలాంటి ప్రాజెక్టు చేయబోతుందా..? అని ఆసక్తిగా చర్చించుకుంటున్నఅభిమానులు, మూవీ లవర్స్ కోసం క్రేజీ న్యూస్ నెట్టింట వైరల్ అవుతోంది. ఘ్ఘుస్తశ్రీఖుఊ ఫేం ఉమేశ్ బిస్ట్ డైరెక్టర్‌తో కొత్త సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది జాన్వీకపూర్. బాలాజీ మోషన్ పిక్చర్స్, సిఖ్య ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ఏక్తాకపూర్, గునీత్ మోంగా ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ వచ్చే అక్టోబర్-నవంబర్‌లో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఉమేశ్ బిస్ట్ The Trial, Gyaarah Gyaarah వెబ్ షోలను డైరెక్ట్ చేశాడు. మరి ఉమేశ్ బిస్ట్ జాన్వీకపూర్ కోసం ఎలాంటి పాత్రను డిజైన్ చేశాడు. ఈ సినిమాతో అయినా జాన్వీకపూర్‌కు బ్రేక్ వస్తుందా..? అనేది తెలియాల్సి ఉంది.

# సుకుమార్ 'ఆర్‌సీ 17' లాంచింగ్ టైం ఫిక్స్..!



ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్నాడు టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ . ఈ గ్లోబల్ స్టార్ సుకుమార్ తో చేసిన రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17 సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది.తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్-రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు. మరి దీనిపై రాంచరణ్-సుకుమార్ టీం నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి.

# రాకా కోసం దీపిక సాహసం?



ప్రెగ్నెన్సీలో కూడా సెట్స్‌కి వచ్చి నటించిన నటీమణులు భారతీయ చలనచిత్ర చరిత్రలో చాలామందే ఉన్నారు. కానీ ప్రెగ్నెన్సీతో ఉండి యాక్షన్ సన్నివేశాల్లో నటించిన హీరోయిన్లు మాత్రం దాదాపుగా లేరనే చెప్పాలి. కానీ దీపిక పదుకోన్ ఆ ఫీట్ చేసి హిస్టరీ క్రియేట్ చేశారు. అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రాకా'లో ఆమె కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే దీపికా పదుకోన్‌పై కీలకమైన యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు అట్లీ చిత్రీకరించారట. రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న దీపిక.. ప్రెగ్నెనీతోనే కఠినమైన యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నారని సమాచారం.ప్రెగ్నెన్సీలో కూడా సెట్స్‌కి వచ్చి నటించిన నటీమణులు భారతీయ చలనచిత్ర చరిత్రలో చాలామందే ఉన్నారు. కానీ ప్రెగ్నెన్సీతో ఉండి యాక్షన్ సన్నివేశాల్లో నటించిన హీరోయిన్లు మాత్రం దాదాపుగా లేరనే చెప్పాలి. కానీ దీపిక పదుకోన్ ఆ ఫీట్ చేసి హిస్టరీ క్రియేట్ చేశారు. అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రాకా'లో ఆమె కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే దీపికా పదుకోన్‌పై కీలకమైన యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు అట్లీ చిత్రీకరించారట. రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న దీపిక.. ప్రెగ్నెనీతోనే కఠినమైన యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నారని సమాచారం.


Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, Krishna, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450